క్లుప్తంగా

క్యాలెండర్ల ఆవిష్కరణ

మక్తల్: విద్యార్థులకు చిన్నప్పటి నుంచే దేశభక్తి పెంపొందించాలని ఎంఈఓ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మండల వనరుల కేంద్రం వద్ద జరిగిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు నర్సింహ, అనిల్‌గౌడ్, భీమ్‌రెడ్డి, రవీందర్, రాకేష్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా న్యూమాంక్స్ కుంగ్‌ఫూ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర కుంగ్‌ఫూ అసోసియేషన్ అధ్యక్షుడు సినీనటుడు నరేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుంగ్‌ఫూ, కరాటే నేర్చుకోవడంతో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. విద్యార్థులు కరాటే నేర్చుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఆలిండియా కుంగ్‌ఫూ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణకుమార్ రాజు, జిల్లా అధ్యక్షులు ఎన్.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కోదండపాణి, సౌత్‌జోన్ ఇన్‌స్ట్రక్టర్ కనకం యాదవ్, కోశాధికారి అంజిరెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో ముందుకు సాగాలి

నారాయణపేట టౌన్ : ముదిరాజులు ఐక్యతతో ముందుకు సాగాలని ఆ సంఘం సీనియర్ నాయకులు సరాఫ్ కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా ముదిరాజ్ అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పట్టణ సీనియర్ సిటిజన్స్, విశ్రాంత ఉద్యోగులు, భవిష్యత్తులో చేపట్టబోయే సేవా కార్యక్రమాల గురించి చర్చించారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం సభ్యులు ఎల్లప్ప, సరాఫ్ నాగరాజ్, గురులింగప్ప, హన్మంతు, సంతోష్‌కుమార్, పోసెమోని శ్రీనివాసులు, వెంటకట్రాములు, గురు మేస్త్రి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల నిర్వహణపై సమావేశం



ధన్వాడ: గణతంత్ర వేడుకల నిర్వహణపై సన్నాహక సమావేశం ధన్వాడ కాంప్లెక్స్ పరిధిలో ఆదివారం నిర్వహించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమేష్ శెట్టి ఆధ్వరంలో మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో యువకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేడుకలలో అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. లక్ష్మణ్, ప్రకాష్, వెంటకేష్, మహమూద్, ఇర్ఫాన్, బాల్‌రాజు, విష్ణు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌కుమార్‌కు ‘శివనంది’ అవార్డు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వివిధ రంగాల్లో చేసిన విశిష్ట సేవలకు శ్రీ లక్ష్మీనారాయణ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు మణి ఆనంద్‌కుమార్ శివ నంది అవార్డును అందుకున్నారు. శ్రీ వాగ్దేవి సంగీత నృత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కోదాడలో అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఆ సంస్థ చైర్మన్ రాఘవేందర్‌యాదవ్ చేతుల మీదుగా ఆయన అవార్డులను అందుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డులను అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరాశ్రయులకు చేయూత నివ్వడంతోపాటు ఆకలితో ఉన్న వారికి అన్నదాన కార్యక్రమాలు చేశారన్నారు. అందుకు గాను తనకు ఈ అవార్డు లభించిందని తెలిపారు. అవార్డును అందుకోవడంతో ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

రోస్టర్ మెరిట్ ఆధారంగా జాబితా చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్ :ప్రభుత్వం ప్రస్తుతం చేపడుతున్న బదిలీలు, ప్రమోషన్లలో భాగంగా సీనియార్టీ జాబితాను కేవలం మెరిట్ ఆధారంగా చేస్తున్నారని, దీంతో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, అందుకోసం రోస్టర్ మెరిట్ ఆధారంగా చేయాలని బీసీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కృష్ణుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీసీ ఉపాధ్యాయులు సీనియార్టీ జాబితాను తయారు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంటనే అధికారులు ప్రభుత్వం స్పందించి సీనియార్టీ జాబితా తయారీలో మార్పులు చేపట్టాలన్నారు. బదిలీలు, పదోన్నతులలో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా పూర్తి స్థాయిలో పారదర్శంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. స్పౌజ్ ఉపాధ్యాయులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుని వారిని న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ సలహాదారుడిగా అబ్దుల్‌రజాక్, ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్‌లను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నాయకులు శ్రీరాములు, రమేష్, గురుప్రసాద్, రాఘవేందర్ పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కరువు

- కార్యాలయాల్లో నిరుపయోగంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు
- మరికొన్ని చోట్ల నిర్వహణ అధ్వానం
- ఇబ్బందులు పడుతున్న ప్రజాప్రతినిధులు, ప్రజలు





ఎంపీడీఓ కార్యాలయంలో చెత్తచెదారంతో నిండి నిరుపయోగంగా మారిన మూత్రశాలలు

మాగనూర్: మండలంలోని ఆయా ప్రభుత్వకార్యాలయాలు, పంచాయతీలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో నిత్యం వివిధ పనుల మీద వచ్చే ప్రజలు, ప్రజప్రతినిధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశమయ్యే ఎంపీడీఓ, మండల సమాఖ్య, తహసీల్దార్ కార్యాలయాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు కరువయ్యాయి. అదేవిధంగా ఆయా కార్యాలయాలకు సంబంధించి నూతనంగా నిర్మించినవి వినియోగంలోలేవు. మరికొన్ని చోట్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. దీంతో ఆయా కార్యాలయాలకు వచ్చే మహిళా ప్రజాప్రతినిధులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మొత్తం 16 గ్రామపంచాయతీలు ఉండగా 10 మంది మహిళలు సర్పంచ్‌లుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాగా 8 పంచాయతీలకు సొంత భవనాలు లేవు. అద్దె భవనాలు, పాఠశాల, కమ్యూనిటీ భవనాల్లో కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. కాగా మరికొన్ని చోట్లు ఎలాంటి వసతులు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవనాలు, ఆయా చోట్ల మరుగుదొడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, కార్యాలయాలకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పరిష్కారానికి కృషిచేస్తాం

ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాం. ప్రస్తుతం వినియోగంలో లేవు. త్వరలోనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువస్తాం. నూతన పంచాయతీ భవనాలతో పాటు, సమస్య ఉన్న చోట్లను పరిశీలించి సౌకర్యాల కల్పనకు కృషిచేస్తాం.

– సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ, మాగనూర్

ఇబ్బందులు పడుతున్నాం



సంక్షేమ పథకాలపై అవగాహన కోసం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే ప్రతి సమావేశానికి వెళ్లాల్సి ఉంటున్న నేపథ్యంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇక్కడకు వచ్చే వారందరం ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు ఇప్పటికైనా స్పందించి కార్యాలయాలకు వచ్చేవారు ఇబ్బందులు పడకుండా సమస్య పరిష్కరించాలి.

–పద్మమ్మ, అమ్మపల్లి సర్పంచ్

వినియోగంలోకి తీసుకురావాలి



మండల కేంద్రంలో అన్ని కార్యాలయాలు కేంద్రీకృతం అయి ఉండటంతో నిత్యం ప్రజలు, ప్రజాప్రతినిధులు అధికంగా వస్తుంటారు. కాగా ఇక్కడ మూత్రశాలలు, మరుగుదొడ్ల ఏర్పాటు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళా ప్రతినిధులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. కొన్నిచోట్ల ఉన్నా నిర్వహణ అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

– నారాయణ, సర్పంచ్, ఓబ్లాపూర్

వాల్‌పోస్టర్ల విడుదల



కృష్ణా: మక్తల్ పట్టణంలో ఈ నెల 26న అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణకు సంబంధించి గోడపత్రికను ఆదివారం గుడెబల్లూర్ గ్రామంలో నాయకులు విడుదల చేశారు.ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణ మాట్లాడుతూ 26న మధ్యాహ్నం అంబేద్కర్ విగ్రహావిష్కరణకు మండల ప్రజలు, సంఘం నాయకులు అత్యదిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అంబేద్కర్ సంఘం నాయకులు రాములు, దత్తత్రేయ, నారాయణ, జిందప్ప, సురేష్, రవి, తిమ్మప్ప, వెంకటేష్, నర్సిములు పాల్గొన్నారు.

నేడు ఆత్మార్పణ దినోత్సవం

మక్తల్: శ్రీ వాసవి కన్యక పరమేశ్వరీ మాత పవిత్ర ఆత్మార్పణ దినోత్సవంను సోమవారం ఘనంగా నిర్వాహించనున్నట్లు ఆలయ కమీటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మక్తల్ పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కోయిల్‌సాగర్ నీళ్లు రైతులకే చెందాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మరికల్: ఎత్తిపోతల ద్వారా జూరాల నుంచి కోయిల్‌సాగర్‌కు వచ్చే నీళ్లు రైతులకు చెందాలని కేవీపీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ అన్నారు. ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా మరికల్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన వ్యక్తం చేస్తూ మాట్లాడారు. నీళ్లను ఇథనాల్ కంపెనీ తరలించుకుపోవడం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్లాస్‌పూర్ నుంచి చిత్తనూర్, జిన్నారం నుంచి లంకాల నక్షబాటలు, దళితుల అసైన్డ్ భూములను అక్రమించిన కంపెనీ యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మురళి, చింతలయ్య, నరేందర్‌రెడ్డి, మణివర్ధన్‌రెడ్డి, రాంచద్రయ్య, మల్లేష్, మధు, మహేష్‌లు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



నేరగడం గ్రామానికి వెళ్లే దారిఇలా..

మాగనూర్: మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్ల మలుపులు ప్రమాదకరంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్కూర్ నుంచి నేరడగం గ్రామానికి ఉన్న బీటీ రోడుపై పలుచోట్ల మలుపులు మరీ ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఈ రోడ్లపై వెళ్లడానికి ప్రయాణికులు జంకుతున్నారు. ఆయా చోట్ల కనీసం సూచిక బోర్డులు లేవని, ముళ్లపొదలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు, ముళ్లపొదలు తొలగింపచేయాలని కోరుతున్నారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఓపెన్ స్కూల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మద్దూరు: చదువు మధ్యలో ఆపేసిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా 10 వ తరగతి, ఇంటర్ చదువుకోవచ్చని తెలంగాణ ఓపెన్ స్కూల్ అధికారి కుమార్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కోఆర్డినేటర్ రామ్ సుభాష్‌లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడే చదివే వారికి పలు సూచనలు చేశారు. ఓపెన్ స్కూల్‌లో చదివిన వారు రెగ్యూలర్ వారితో సమానంగా పోటీ పరీక్షల్లో పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ దాసు, ఉపాధ్యాయులు నర్సప్ప, గౌస్, శేఖర్ తదితరులున్నారు.

ఆర్యవైశ్యులకు విద్యారుణాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగడానికి సీఎం కేసీఆర్ అవకాశాలు ఇస్తున్నారని రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ సోమ భరత్‌కుమార్ అన్నారు. శ్రీవాసవీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని వాసవీ ఫంక్షన్‌హాల్‌లో 101 మంది విద్యార్థులకు రూ.28లక్షల వడ్డీలేని విద్యారుణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆయనతోపాటు ఉప్పల శివకుమార్ ఐపీఎస్, ఇంటలిజెన్స్ ఓఎస్‌డీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయంగా, సామాన్య ప్రజలకు సేవలందించే విధంగా ముందుకు రావాలని కోరారు. విద్యారుణాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఇతరులకు సహాయం చేసే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీవాసవీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, ప్రధాన కార్యదర్శి కండె కుమారస్వామి, కోశాధికారి కలకొండ సూర్యనారాయణ, సలహాదారు గుండ్ల కృష్ణయ్య, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పాలాది రాంమోహన్, పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మిర్యాల వేణుగోపాల్, శ్రీవాసవీ విద్యా వసతి గృహం అధ్యక్షుడు కొండ చక్రధర్‌గుప్త పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నవాబుపేట: అమ్మలగన్న అమ్మా మైసమ్మ.. కోరిన కోరికలు తీర్చే మాయమ్మ అంటూ మైసమ్మ దేవత నామస్మరణ మార్మోగింది. పచ్చటి అడవిలో ఆహ్లాదకరమైన వాతావరణంతో పక్షుల కిలకిల రావాల మధ్య అమ్మ జపంతో అడవి పులకరించింది. మండల పరిధిలోని మైసమ్మ దేవాలయంలో ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయం జన జాతరల మారింది. పలువురు మహిళలు బోనాల మొక్కులు, పూజలు చేశారు.

30ఏళ్లుగా ఎదురుచూపులు



పట్టా కాగితాన్ని చూపిస్తున్న ఓ లబ్ధిదారు

మరికల్: ఒకటి కాదు..రెండు కాదు ఏకంగా ఇళ్ల స్థలాల కోసం 30 ఏళ్ల నుంచి పస్పుల గ్రామస్తులకు ఎదురు చూపులు తప్పడం లేదు. గ్రామంలో 1993లో ఇళ్లులేని అర్హులైన 65 మంది లబ్ధిదారులను గుర్తించారు. ప్రభుత్వ స్థలమైన సర్వే నంబర్ 211లోని 3 ఎకరాల 19 గుంటల స్థలంలో 65 మంది అబ్దిదారులకు ఒక్కొక్కరికి 135 చదరపు గజాల చొప్పున ప్లాట్లను పంపిణీ చేసి పట్టాలను అందజేశారు. కానీ హద్దులు చూపించకపోవడంతో ఇప్పటికీ ఎదురుచూస్తూనే ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడంతో పస్పుల గ్రామాన్ని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఎంపిక చేశారు. కానీ ఇప్పటికీ పునాది రాయి పడలేదు. దీంతో లబ్ధిదారులకు కనీసం ఇళ్లు వచ్చే అవకాశం కనిపించడం కూడా లేదు. ప్రస్తుతం వారికి కేటాయించిన స్థలాలు ముళ్లచెట్లతో నిండిపోయి కనిపిస్తున్నాయి. విషయంపై తహసీల్దార్ రామ్‌కోటి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలన్నారు. అప్పుడే ఎంపిక చేసిన గ్రామాల్లో మరోసారి లబ్ధిదారుల ఎంపిక, పరిశీలన చేసి ఇళ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

నారాయణపేట టౌన్ : విద్యార్థులు పరీక్షల విషయంలో ఒత్తిడికి గురికావొద్దని బీజేపీ నాయకులు అన్నారు. పరీక్ష పే చర్చా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో సోమవారం డ్రాయింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌వర్ధన్ ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో ఒత్తికి గురి కాకుండా ఉండేందుకు ఆర్ట్, డ్రాయింగ్ వేయాలన్నారు. చిత్రాలు బాగా వేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు ఇస్తామన్నారు. ఈనెల 27న ప్రధానమంత్రి నరేంద్రమోదీ విద్యార్థులను ఉద్దేశించి పరీక్ష పే చర్చా కార్యక్రమంలో ప్రసంగిస్తారని తెలిపారు. విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని జయపద్రం చేయాలని కోరారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

నారాయణపేట టౌన్ : పట్టణంలోని భీవండి కాలనీ హైదరాబాద్ రోడ్డు పక్కనే ఉండటంతో, ఆ రహదారిని దాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు రద్దీగా ఉంటుండడం, వాహనాలు వేగంగా వస్తుండడంతో ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

నర్వ: మండలంలో బీజేపీ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం సీపురం గ్రామంలో బీజేపీ వార్డుల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడంఖాయమన్నారు. బూత్‌కమిటీ అధ్యక్షులుగా వాసారెడ్డి, ఉపాధ్యక్షులుగా బోయ అంజప్ప, బాస్కర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా దౌలత్‌ఖాన్, కార్యదర్శిగా మహేష్, బడేసాబ్, గవినోళ్ళ బాల్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులుగా వావిళ్ల రవికుమార్‌రెడ్డి, మండల నాయకులు నర్సింహ, రైచూర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా చేపట్టాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: త్వరలో చేపట్టనున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని ఆల్‌వేస్ ప్రొగ్రేసివ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ రఫీక్, సయ్యద్ జలీలుద్దీన్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏపీయూటీఏ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోన్నతులు, బదిలీల్లో ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఇతర మీడియం ఉపాధ్యాయుల మాదిరిగా ఉర్దూ మీడియం టీచర్ల సీనియార్టీ జాబితాను బహిరంగంగా ప్రకటించాలని కోరారు. గతంలో చేపట్టిన పదోన్నతులు, బదిలీల్లో ఉర్దూ మీడియం ఉపాధ్యాయుల సీనియార్టీ లిస్టులో అన్యాయం జరిగిందన్నారు. సీనియార్టీ ప్రకారం ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఆల్‌వేస్ ప్రొగ్రేసివ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ ఉపాధ్యక్షులు అహ్మద్ మొహియొద్దీన్, కోశాధికారి మహ్మద్ యూనుస్, మీడియా కార్యదర్శి అబ్దుల్ వాసే, మహిళా విభాగం ప్రతినిధి నఫీర్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జములమ్మ ఉత్సవాలు

అమరచింత: పట్టణంలో వెలసిన జములమ్మ దేవతా ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. 23న అమ్మవారి వెండి ఆభరణాలు, పట్టువస్త్రాలను పట్టణంలోని మార్కండేయ ఆలయం నుంచి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం నుంచి జములమ్మ ఆలయంలో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

‘ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం’

నారాయణపేట టౌన్ : ప్రపంచలో ఉన్న అతిపెద్ద లౌకిక, ప్రజస్వామ్య దేశాలలో ఒకటిగా ఉండి ఇతర దేశాలకు స్ఫూర్తిగా ఉన్న భారతదేశంలో రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నర్సింహ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనాతీరును విమర్శించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, పోస్టర్, బ్యాంకింగ్, రైల్వే, బొగ్గుగనుల, రవాణా సంస్థలను ప్రైయివేటికరణ చేస్తూ, బడా పెట్టుబడిదారులకు ధారదత్తం చేస్తోందని ఆరోపించారు. స్విస్ బ్యాంకుల్లోని నల్లధనం వెనక్కు తెస్తామన్న మాటలు నీటి మూటలుగా మిగిలాయని పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా వెనుకబడిన ప్రాంతంగా ఉన్నదని, జిల్లా ఏర్పడి 4 ఏళ్లు దాటినా జిల్లా మౌలిక, దీర్ఘకాలిక సమస్య పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధిని చూపడం లేదని అన్నారు. జిల్లాలో కాలుష్యరహిత పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించాల్సింది పోయి మరికల్ మండలం చిత్తనూర్ ప్రాంతంలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. వెంటనే ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొండన్న , సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పాదుకల ఊరేగింపు



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

నారాయణపేట టౌన్ : సద్గురు రూపరహిత అహింసా యోగేశ్వరి వీర ధర్మజ మాతా మాణికేశ్వరి సూర్యనంది క్షేత్రం యనగుంది ఆశ్రమం నుంచి ఆదివారం అమ్మవారి వెండి పాదుకల ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. కాన్‌కుర్తి, మున్నాపల్లి, దామరగిద్ద మీదుగా నారాయణపేట పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయ వరకు కార్యక్రమం కొనసాగింది. అనంతరం మాతా మాణికేశ్వరి ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో వెండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి పట్టణ పుర వీధుల మీదుగా భక్తి భజన గీతాలను ఆలపిస్తూ ఊరేగింపును పగిడిమార్రి రోడ్‌లో కొలువుదీరిన మాతా మాణికేశ్వరి ఆశ్రమం వరకు కొనసాగించారు. స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి పూజలలో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు ఏవీ మందార్, బండి శివరాంరెడ్డి, వాల్వేకర్ నికేతన్, దశరథ్, సీతారాములు, కె.శ్రీనివాస్, బిఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు బండి రాజేశ్వరి, కౌన్సిలర్ నారాయణమ్మ, రైచూర్ ఆశ్రమ సభ్యులు, భజన మండలి సభ్యులు, భక్తులు, మహిళలు, పట్టణ పుర ప్రముఖులు, వివిధ గ్రామాల గురు భక్త బృందం పాల్గొన్నారు.

బాలికలు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మక్తల్ సీఐ సీతయ్య

మక్తల్: జాతీయ బాలికల దినోత్సవంను పురస్కరించుకొని నారయణపేట జిల్లా టగ్గాఫ్ వార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు ముఖ్యఅతిథిగా స్థానిక సీఐ సీతయ్య హాజరై మాట్లాడారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. బాలికలు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటామన్నారు. అసోసియేషన్ కన్వీనర్ బ్రహ్మనందం, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం, జిల్లా అధ్యక్షుడు రఘు ప్రసన్న, తాన్‌సింగ్, నర్సింహగౌడ్, ఎస్సై పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గార్లపహాడ్‌లో రిలే నిరాహార దీక్షలు

కోయిల్‌కొండ: నూతన మండలంగా గార్లపహాడ్‌ను ప్రకటించాలని సోమవారం నుంచి గార్లపహాడ్ స్టేజి దగ్గర మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు రామునాయక్, వెంకట్రామిరెడ్డి, నవీన్‌లు అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించే వరకు రిలే దీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా వెంటనే మండలంగా ప్రకటించాలని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. లేనిచో ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ రిలే దీక్షలకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఎంపీ వెంకటేష్ సంఘీభావం తెలిపేందుకు రిలే నిరాహార దీక్షలో పాల్గొనేందుకు వస్తున్నారని వారు తెలిపారు. కావున చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పార్టీలకతీతంగా హాజరుకావాలని వారు కోరారు.